ఇందిరమ్మ కమిటీల్లో జాప్యం

- బాన్సువాడ నియోజకవర్గంలో ప్రారంభం కాని గెజిటెడ్ అధికారుల సర్వే
- నేటి నుంచి ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజలు ప్రారంభం


నాగారంలో నిర్మాణంలో ఉన్న ఇంటిని పరిశీలిస్తున్న అధికారులు

బాన్సువాడ రూరల్: సొంతింటి కల బాన్సువాడ నియోజకవర్గంలో మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉంది. కామారెడ్డి జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం గెజిటెడ్ అధికారుల క్షేత్ర సర్వే పూర్తికావడంతో అర్హులజాబితాను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించారు. ఈనెల 5నుంచి భూమిపూజలు కూడా ప్రారంభం కానున్నాయి. బాన్సువాడ నియోజకవర్గంలో పాత, కొత్త నేతల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఇందిరమ్మ కమిటీల్లో జాప్యం జరుగుతోంది. గ్రామాలు , వార్డుల్లో ఇందిరమ్మ కమిటీల ఆమోదం లభించలేదు. ఇందిరమ్మ కమిటీలు ఆమోదించిన లబ్ధిదారుల జాబితాపై గెజిటెట్ అధికారుల సర్వే పూర్తి చేసి ఈనెల 5నుంచి అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేపట్టాలనే ప్రభుత్వం నిర్ణయించింది. బాన్సువాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజలు ఆలస్యం అయ్యే అవకాశం ఉంది.

ఐదుగురు సభ్యులతో కమిటీ..

గ్రామాల్లో ఇందిరమ్మ లబ్ధిదారులను ఎంపిక చేయడానికి ప్రభుత్వం ఐదుగురు సభ్యులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గ్రామ సర్పంచ్ స్థానంలో ఉన్న ప్రత్యేకాధికారి కమిటీ చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. ఎస్సీ, బీసీ, ఓసీ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు, ఇద్దరు డ్వాక్రా మహిళలు సభ్యులుగా ఉంటారు. గ్రామ పంచాయతీగా ఉన్న గిరిజన తండాల్లో సభ్యులంతా గిరిజనులే ఉంటారు.

పలుదశల్లో లబ్ధిదారుల వడపోత..

ప్రజాపాలన భాగంగా వచ్చిన దరఖాస్తులను తొలివిడతలో పంచాయితీ కార్యదర్శుల అర్హుల గుర్తింపుకు ప్రత్యేక యాప్ ద్వారా సర్వే చేపట్టి దరఖాస్తుదారులను ఎల్1, ఎల్2, ఎల్3గా గుర్తించారు. ఎల్ 1లో ఉన్న వారిలో వికలాంగులకు, వింతంతువులు, ఒంటరి మహిళలు, సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకోవడానికి ఆసక్తి ఉన్న వారిని ఇందిరమ్మ కమిటీ సభ్యులు తొలివిడతలో ఎంపిక చేసి ఆమోదం తెలపాల్సి ఉంటుంది. ఇందిరమ్మ కమిటీ ఆమోదం పొందిన జాబితాను ఏప్రిల్ 21నుంచి 30 వరకు గెజిటెడ్ అధికారులు క్షేత్రపర్యటన ద్వారా రీసర్వే చేసి ఎంపీడీవోకు సమర్పించాలి. మే 1న ఎంపీడీవో లాగిన్‌కు వచ్చిన మెరిట్ లిస్టును 2న గ్రామ పంచాయతీ నోటీస్‌బోర్డుపై ప్రదర్శించాలి. మే 3,4 తేదీల్లో మెరిట్‌లిస్టు ఆన్‌లైన్ పోర్టల్‌లో వెరిఫికేషన్ జరిగిన వెంటనే మే 5నుంచి హౌసింగ్ అధికారులతో కలిసి గ్రామాల్లో ప్రభుత్వం సూచించిన కొలతల మేరకు ఇంటినిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు.

దరఖాస్తులు 8,957.. మంజూరు 633

బాన్సువాడ మండలంలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణాకోసం ప్రజాపాలనలో 8,957 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో ఎల్1లో 2,796, ఎల్ 2లో 3,391, ఎల్ 3లో 2,770 దరఖాస్తులు ఉన్నాయి. కాగా తొలి విడతలో బాన్సువాడ మండలానికి తొలివిడతలో 633 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, వీరిని ఎల్1లో నుంచి ఎంపిక చేయాల్సి ఉంది. ప్రజాపాలనలో భాగంగా ఎంపికైన నాగారం గ్రామానికి 78 ఇండ్లు మంజూరు లభించగా పనులు వివిధ దశల్లో ఉన్నాయి.

రీసర్వే పూర్తి కాలేదు

బాన్సువాడ నియోజకవర్గంలో ఇందిరమ్మ కమిటీలు ఆమోదం పొందలేదు. అర్హుల జాబితా ఇవ్వకపోవడంతో గెజిటెడ్ అధికారుల రీసర్వే జరుగలేదు. దీంతో షెడ్యూల్ ప్రకారం ఈనెల 2న గ్రామ పంచాయతీల్లో అర్హులజాబితా ప్రదర్శించలేదు. ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తాం.

– సత్యనారాయణరెడ్డి, డీఎల్‌పీవో, బాన్సువాడ

క్లుప్తంగా

భగీరథ మహర్షికి ఘన నివాళి


నివాళులు అర్పిస్తున్న ఉప్పర సంఘం నాయకులు

ఎల్లారెడ్డి: పట్టణంలో భగీరథ మహర్షి జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పర సంఘ కార్యాలయంలో భగీరథ మహర్షి విగ్రహానికి సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉప్పర సంఘం నాయకులు అశోక్, సాయిబాబా తదితరులున్నారు.

సైనికుడికి సన్మానం


సైనికుడిని సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే

నిజాంసాగర్(జుక్కల్): జుక్కల్ మండలం హంగర్గ గ్రామానికి చెందిన సైనికుడు పాంచల్ హన్మంత్‌ను ఆదివారం జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ సింధే ఘనంగా సన్మానించారు. ఇటీవల అగ్నివీర్‌కు ఎంపికైన పాంచల్ హన్మంత్‌ను యువత ఆదర్శంగా తీసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నీలుపటేల్, రమేష్, యువకులు శివకుమార్, కిరణ్, పండరి, మారుతి తదితరులున్నారు.

యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతి అక్రమాలకు చెక్


మాట్లాడుతున్న గంప శశాంక్

భిక్కనూరు: యువత రాజకీయాల్లోకి వస్తే అవినీతి అక్రమాలకు చెక్ పెట్టవచ్చని బీఆర్ఎస్ రాష్ట్ర విభాగం నాయకుడు గంప శశాంక్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన మండల బీఆర్ఎస్ యువజనవిభాగం కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ యువజన విభాగం కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిలదీయాలన్నారు.వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత సత్తా చూపాలన్నారు. ఈసమావేశంలో బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు రంజీత్‌వర్మ, ప్రధానకార్యదర్శి ఆకుల ప్రవీణ్, నాయకులు అందే మహేందర్‌రెడ్డి,గంగళ్ల రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ


చెక్కులను అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్దకొడప్‌గల్ (జుక్కల్): మండలంలోని కాటేపల్లి తండాలో బాధితులకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను ఆదివారం కాంగ్రెస్ నాయకులు పంపిణీ చేశారు. తండాకు చెందిన రాఠ్యా జైపాల్‌కు రూ.56వేలు, బర్దావల్ కముందబాయికి రూ. 37 వేల చెక్కును నాయకులు అందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మల్లప్ప పటేల్, గంగాగౌడ్, రంజిత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మలిదశ ఉద్యమకారుల సమస్యలు పరిష్కరించాలి


సమావేశంలో పాల్గొన్న నాయకులు

బాన్సువాడ : మలిదశ ఉద్యమకారుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని బాన్సువాడ మలిదశ ఉద్యమ కారుల ఫోరం నాయకులు ఉడుత గంగాధర్, చందు అన్నారు. ఆదివారం కరీంనగర్‌లో నిర్వహించిన ఉత్తర తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశానికి బాన్సువాడ మలిదశ ఉద్యమకారులు హాజరై సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లారు. తెలంగాణ ఉద్యమంలో కేసులు నమోదై జైలు పాలైన ఉద్యమకారుల సమస్యలను వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. మలిదశ ఉద్యమకారులు భాస్కర్‌గౌడ్, కల్వల శ్యాం, రాజు, గంగారం, మారెపల్లి గంగారం తదితరులున్నారు.

ఆర్థిక సహాయం అందజేత

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన మఠం సిద్ధిరాములు భిక్కనూరు మండలంలోని రామేశ్వరపల్లి గ్రామంలో చౌడమ్మ దేవాలయంలో పూజారిగా పనిచేస్తున్నారు. శనివారం ఆకస్మాత్తుగా మరణించారు. ఆదివారం నిర్వహించిన పూజారి అంత్యక్రియల కోసం వీరశైవ లింగాయత్ సమాజం ప్రతినిధులు రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న వెంకట్‌రెడ్డి

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ బాగ్ లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఉద్యోగ సదస్సులో జిల్లాకు చెందిన ముగ్గురు నాయకులు ఒకే వేదికపై మాట్లాడారు. ఉద్యోగ జేఏసీ చైర్మన్ నరాల వెంకట్ రెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదర్‌రెడ్డి, టీపీటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు అనిల్‌కుమార్‌లు ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపై నిర్వహించిన రాష్ట్ర సదస్సుకు జిల్లా నుంచి టీఎన్జీవోస్, టీజీవోస్, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు తరలివెళ్లారు.

ట్రాన్స్‌కో అధికారులకు నూతన ఫోన్ నంబర్లు

కామారెడ్డి టౌన్: కామారెడ్డి డివిజన్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ట్రాన్స్‌కో అధికారులు, సిబ్బందికి నూతన ఫోన్ నంబర్లను కేటాయించినట్లు డీఈ కృష్ణ చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ సమస్యలుంటే ఆయా నంబర్లలో వినియోగదారులు సంప్రదించాలని సూచించారు.

అధికారుల ఫోన్ నంబర్ల వివరాలు..

ఎస్‌జీఈ/ఎస్‌డీ కామారెడ్డి టౌన్	85004 12459	ఎస్ఎల్ఐ/కామారెడ్డి రూరల్	85004 12784
ఎల్ఐ/కామారెడ్డి టౌన్-1	85004 12480	కలెక్టరేట్ సబ్‌స్టేషన్	85004 11851
ఎఫ్ఎం/కామారెడ్డి టౌన్-2	85004 12546	కాకతీయనగర్ సబ్‌స్టేషన్	85004 11862
ఎల్ఎం/దేవునిపల్లి	85004 12586	హౌసింగ్ బోర్డు సబ్‌స్టేషన్	85004 11872
ఎల్ఐ/ఎర్రాపహాడ్	85004 12625	శాబ్దిపూర్ సబ్‌స్టేషన్	85004 11883
ఎల్ఎం/తాడ్వాయి	85004 12689	లింగాపూర్ సబ్‌స్టేషన్	85004 11901
ఎస్ఎల్ఐ/తాడ్వాయి	85004 12764	కన్కల్ సబ్‌స్టేషన్	85004 11918

అధ్వానంగా దేవాయిపల్లి–బ్రాహ్మణపల్లి రోడ్డు



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని దేవాయిపల్లి నుంచి బ్రాహ్మణపల్లికి వెళ్లే రోడ్డును బాగుచేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు. గత రెండు సంవత్సరాల క్రితం వేసిన రోడ్డు పూర్తిగా ధ్వంసమై అధ్వానంగా మారింది. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రతిరోజు వెళ్లే ప్రయాణికులు, రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పలు మార్లు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అలాగే తాడ్వాయి నుంచి చిట్యాలకు వెళ్లే రోడ్డులో తమ్మలవాని వాగుపై బ్రిడ్జిని నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులకు ఎస్పీ అభినందన

బాన్సువాడ : ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకోకుండా ప్రాణాలు కాపాడిన బాన్సువాడ పోలీసులను ఆదివారం ఎస్పీ రాజేశ్ చంద్ర 'ఎక్స్' వేదికగా అభినందించారు. వివరాల్లోకి వెళ్తే.. బాన్సువాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని పాత బాన్సువాడ గూడెంగల్లీకి చెందిన ఓ వ్యక్తి తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని అర్ధరాత్రి 1.40 గంటలకు 100కు డయల్ చేశాడు. వెంటనే స్పందించిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుల్ భరత్, హోంగార్డు సతీష్ సంఘటన స్థలానికి చేరుకొని తన ఇంట్లో లుంగితో ఫ్యాన్‌కు ఉరేసుకునేందుకు యత్నించిన వ్యక్తి ప్రాణాలను రక్షించారు.

అనంతరం సదరు వ్యక్తికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ ఘటనపై ఎస్పీ వారిని అభినంధించారు. బ్లూ కోల్ట్స్ చొరవ, సేవా దృక్పథం పోలీసు వ్యవస్థపై ప్రజల్లో నమ్మకాన్ని మరింత పెంచిందని ఎస్పీ అన్నారు.

ఇళ్లపై నుంచి విద్యుత్ తీగలు



బాన్సువాడ రూరల్: మండలంలోని చిన్న రాంపూర్ గ్రామంలో విద్యుత్ తీగలు ఇళ్లపై నుంచి వెళ్తున్నాయి. దీంతో ప్రతి ఏటా ఇంటి పైకప్పు మరమ్మతులు చేసుకోవాల్సి వచ్చినప్పుడు గ్రామంలో విద్యుత్ సరఫరా నిలిపివేయాల్సి వస్తోంది. కొన్నిసార్లు నిలిపివేయకుండానే ప్రమాదకరంగా పనులు చేయాల్సి వస్తోంది. ఇళ్లపై నుంచి ప్రమాదకరంగా వెళ్తున్న తీగలను మార్చాలని కోరినా విద్యుత్‌శాఖ అధికారులు స్పందించడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల్లో భాగంగా అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

ఘనంగా రేణుకా ఎల్లమ్మ వార్షికోత్సవం


ఎల్లమ్మ ఆలయం వద్ద పూజలో పాల్గొన్న భక్తులు

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని అచ్చంపేట గ్రామ శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయ వార్షికోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఎల్లమ్మ తల్లికి అభిషేకాలు, అర్చనలు చేసి ఒడి బియ్యం సమర్పించారు. ప్రతి ఏటా నాలుగు రోజుల పాటు అమ్మవారి ఉత్సవాలు జరుపుతున్నట్లు ఆలయ నిర్వహకుడు బంగ్ల ప్రవీణ్ ముదిరాజ్ తెలిపారు. ఈ నెల 7న ఆలయం ఆవరణలో మల్లయోధుల కుస్తీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు.

ఉత్సవాలకు ముస్తాబైన ఎల్లమ్మ ఆలయం


అమ్మవారి మూలవిరాట్

దోమకొండ: మండల కేంద్రంలోని రేణుకా ఎల్లమ్మ ఆలయం ఉత్సవాలకు ముస్తాబైంది. సోమవారం నుంచి బుధవారం ఆలయ ఉత్సవాలు ఉంటాయని గౌడ సంఘం అధ్యక్షుడు రాజనర్సాగౌడ్ తెలిపారు. సోమవారం గణపతిపూజ, పుణ్యవచణం, అమ్మవారికి అభిషేకాలు, తదితర కార్యక్రమాలు ఉంటాయి. మంగళవారం రేణుకా ఎల్లమ్మ జమదగ్నిల కల్యా ణం అనంతరం అమ్మవారికి ఒడిబియ్యం, సాయంత్రం అమ్మవారికి బోనాలు తీయడం ఉంటాయి. బుధవారం తిరుగు బోనాలు, పుట్ట ఎల్లమ్మ వద్ద పూజ కార్యక్రమాలు ఉంటాయి. ఆలయాన్ని రంగు లు విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.

శ్రీరామాలయం నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ చేసిన నాయకులు

భిక్కనూరు: మండలంలోని రామేశ్వర్‌పల్లి గ్రామంలో శ్రీరామాలయం నిర్మాణానికి వేదపండితులు శ్రీనివాస శర్మ ఆధ్వర్యంలో పూజ కార్యక్రమాలను కార్యక్రమంలో గ్రంథాలయసంస్థ చైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, వీడీసీ అధ్యక్షుడు మద్ది సూర్యం, నేతలు నరేందర్‌రెడ్డి, సందుగారి రవిందర్‌రెడ్డి, వినోద్‌గౌడ్, శేఖర్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలి


ఎల్లారెడ్డిలో మాట్లాడుతున్న ఎంఈవో రాజులు


తాడ్వాయిలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో రామ స్వామి


పిట్లంలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు

ఎల్లారెడ్డిరూరల్/తాడ్వాయి/పిట్లం : సమ్మర్ క్యాంప్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో రాజులు అన్నారు. ఆదివారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో సమ్మర్ క్యాంపును ఆయన ప్రారంభించారు. సమ్మర్ క్యాంప్‌లో విద్యార్థులకు డ్రాయింగ్, పెయింటింగ్, కంప్యూటర్, యోగా, డ్యాన్స్‌కు సంబంధించిన శిక్షణ ఇస్తామన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 6 నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న వారికి 15 రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి 10 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లింగమూర్తి, ఉపాధ్యాయులు వనజ, శ్రీనివాస్ తదితరులున్నారు.అలాగే తాడ్వాయి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వాలీబాల్ సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో రామస్వామి ప్రారంభించారు.కార్యక్రమంలో హెచ్ఎం కళ్యాణి, మాజీ వైస్ ఎంపీపీ నర్సింలు, ఉపాధ్యాయులు, యువకులు, క్రీడాకారులు పాల్గొన్నారు. పిట్లం జెడ్పీహెచ్ఎస్ లో సమ్మర్ క్యాంప్‌ను ఎంఈవో దేవిసింగ్ ప్రారంభించారు. క్యాంప్‌లో భాగంగా విద్యార్థులకు ప్రతిరోజు కబడ్డీ, అథ్లెటిక్స్ పై శిక్షణ ఇస్తామని ఆయన పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు కబడ్డీ ఇతర ఆటల పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రూప్‌సింగ్, ప్రమోద్ కుమార్, నారాయణ, కృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

స్పోకెన్ ఇంగ్లిష్ శిక్షణ శిబిరం


ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్న నిపుణుడు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా స్పోకెన్ ఇంగ్లిష్‌పై శిక్షణ ఇస్తున్నట్లు ఎంఈవో షౌకత్ అలీ తెలిపారు. ప్రతి రోజు ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు మే 30 వరకు ఉచితంగా ఇంగ్లిష్ బోధన చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇంగ్లిష్ శిక్షకునిగా ఎట్టం సాయిరాం, కోర్సు ఇన్‌చార్జిగా వహీద్‌సిద్దికీ వ్యవహరిస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 944148 3936 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

శాబ్దిపూర్ రోడ్డులో క్రికెట్ శిక్షణ శిబిరం ప్రారంభం

కామారెడ్డి అర్బన్: పట్టణ పరిధిలోని శాబ్దిపూర్ రోడ్డులో చర్చి సమీపంలో ఆదివారం ఎంసీఏ క్రికెట్ అకాడమీ వేసవి బాల బాలికల శిక్షణ శిబిరాన్ని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నరాల వెంకట్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రికెట్ ఆటగాళ్లు బాలాజీ, దేవేందర్, టీఎన్జీవోస్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రతినిధులు చక్రధర్, మహిపాల్, శ్రీనివాస్‌రెడ్డి, దీక్షిత్, రోహిత్, నవీన్, రాహుల్, మనోహర్, పవన్, నిర్వహకులు చందురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుక

ఎల్లారెడ్డిరూరల్: పట్టణంలోని బగళాముఖి అమ్మవారి పీఠంలో సోమవారం బగళాముఖి అమ్మవారి జన్మదిన వేడుకలను నిర్వహించనున్నట్లు జ్యోతిష్య పండితులు క్రాంతి పటేల్ తెలిపారు. ఈసందర్భంగా అభిషేకాలు, కుంకుమార్చన, పుష్పార్చన, అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి నృసింహాలయ బ్రహ్మోత్సవాలు

మాచారెడ్డి: మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలను సోమవారం నుంచి ఈనెల 12వ తేదీ వరకు నిర్వహించనుట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీధర్‌రావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామి వారి బ్రహోత్సవాలలో పాల్గొనాలని కోరారు.

వెండి పాత్ర వితరణ

చుక్కాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి అదే గ్రామానికి చెందిన మామిడాల సంతోష్ కుమార్ రూ. 15వేల విలువైన వెండి పాత్ర, ఉద్ధరిణి అందించారు. ఈ సందర్భంగా దాతను ఆలయ అధికారులు సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి, ఈవో శ్రీధర్‌రావు, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

రేపు సీతా నవమి కార్యక్రమం

కామారెడ్డి అర్బన్: పట్టణంలోని ఆర్ బీ నగర్ కాలనీలో ఇష్ట కార్యసిద్ధి హన్‌మాన్ ఆలయంలో మంగళవారం వీహెచ్‌పీ మాతృశక్తి దుర్గావాహిని ఆధ్వర్యంలో సీతా నవమి కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు మాతృశక్తి ప్రతినిధులు బి.రాజశ్రీ, జి.ఇందిరలు తెలిపారు. కవి,రచయిత్రి ఎస్.సునీత ప్రధాన సందేశం ఉంటుందన్నారు.

7న ఆర్యవైశ్యుల శోభాయాత్ర

కామారెడ్డి అర్బన్: పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి జన్మదిన వేడుకలు, శివపార్వతుల కల్యాణోత్సవం, శోభాయాత్ర నిర్వహించనున్నట్లు పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎం.భూమేష్ తెలిపారు. మహారాష్ట్ర వాయిద్యాలతో నిర్వహించే శోభాయాత్రకు హిందువులందరు తరలిరావాలని ఆయన కోరారు.

రేపు తెరవే రాష్ట్ర కార్యవర్గ సమావేశం

కామారెడ్డి అర్బన్: తెలంగాణ రచయితల వేదిక(తెరవే) రాష్ట్ర కార్యవర్గ సమావేశం మంగళవారం కామారెడ్డి కర్షక్ బీఎడ్ కళాశాలలో నిర్వహించనున్నట్లు తెరవే అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గఫూర్ శిక్షక్, అల్లిమోహన్‌రాజ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి తెరవే రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండి మల్లారెడ్డి, బూర్ల వెంకటేశ్వర్లతో పాటు వివిధ జిల్లాల ప్రతినిధులు, ప్రముఖ కవులు, రచయితలు హాజరుకానున్నట్లు వారు పేర్కొన్నారు.

నేడు పీపుల్స్ ప్రోగెసివ్ ట్రస్ట్ ఉచిత విద్య ప్రవేశ పరీక్ష

కామారెడ్డి అర్బన్: హైదరాబాద్ ప్రగతినగర్ పీపుల్స్ ప్రోగెసివ్ ట్రస్ట్(పీపీటీ) ఆధ్వర్యంలో అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద కుటుంబాల పిల్లలకు ఉచిత రెసిడెన్షియల్ విధానంలో నుంచి డిగ్రీ వరకు విద్యను అందించడానికి సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కామారెడ్డి జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నారు. టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆకుల బాబు, కార్యదర్శి సాయిలు, రాష్ట్ర నాయకులు రాజవర్ధన్‌లు ఈమేరకు ఆదివారం ఒక ప్రకటలో తెలిపారు. అరగంట ముందు పరీక్షకు హాజరు కావాలన్నారు.

ఆదర్శ కళాశాలలో ప్రవేశాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

సదాశివనగర్ (ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఆదర్శ కళాశాలలో ఇంటర్‌లో ప్రవేశం పొందడానికి ఈ నెల 5 నుంచి 20 వ తేదీ లోగా దరఖాస్తులు చేసుకోవలన్నా రు. ఇందుకోసం అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ రాజిరెడ్డి తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఏంఈ సీ గ్రూపులు ఉన్నాయన్నారు. ఒక్కో గ్రూపులో 40 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కొత్తబాది మోడల్ కళాశాలలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని కొత్తాబాది మోడల్ జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌లో అడ్మిషన్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కమల్ కిషోర్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. సోమవారం నుంచి ఈనెల 20 వరకు దరఖాస్తుల స్వీకరించి 26న మెరిట్ జాబితాను ప్రదర్శిస్తామన్నారు. ఈనెల 27నుంచి 31 వరకు సర్టిఫికేట్ వెరిఫికేషన్, అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుందన్నారు. ఆసక్తి గల స్థానిక విద్యార్థులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అలంకారప్రాయంగా సాసర్‌పిట్‌లు


నీళ్లు లేక బోసిపోతున్న సాసర్‌పిట్

బాన్సువాడ రూరల్: ఎండాకాలంలో వన్యప్రాణుల దాహార్తి తీర్చడానికి అటవీశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సాసర్‌పిట్‌లు నీళ్లు లేక బోసిపోతున్నాయి. వేసవి ప్రారంభమై రెండు నెలలు పూర్తయినా సాసర్‌పీట్‌లను నీటితో నింపడంలేదు. దీంతో వన్యప్రాణులు రోడ్లపైకి, జనవాసాల్లోకి వస్తున్నాయి. అధికారులు స్పందించి వన్యప్రాణుల సంరక్షణకు తగిన చర్యలు తీసుకోవాలని జంతు ప్రేమికులు కోరుతున్నారు.